## క్లుప్తంగా

### వెంపడాంలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న క్లాప్ వర్కర్లు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాంలో గ్రామదేవత పండుగ పూర్తవడంతో పారిశుధ్య పనులు చురుగ్గా చేపడుతున్నారు. మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి. ఐదుగురు కార్యదర్శులు, 30 మంది క్లాప్‌మిత్రల ఆధ్వర్యంలో వెంపడాం, తాళ్లపేట, శేరిపేట గ్రామాల్లో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు.

### చిన్నారులకు వేసవి వినోదం



వేసవి వినోదం కార్యక్రమంలో చిన్నారులు

విజయనగరం: జనవిజ్ఞాన వేదిక విజయనగరం జిల్లా సమత విభాగం ఆధ్వర్యంలో గురువారం వేసవి వినోదం కార్యక్రమం ప్రారంభించారు. నగరంలోని 29వ డివిజన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సమత విభాగం రాష్ట్ర కన్వీనర్ జి. నిర్మల మాట్లాడుతూ, చిన్నారులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించేందుకు ఇటువంటి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెదడుకి మేత, క్యారంబోర్డు, దేశభక్తి గీతాలు, అభినయ గీతాలు నేర్పించనున్నట్లు తెలిపారు. చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధి జగదాంబ, చిన్నారులు పాల్గొన్నారు.

### జోరుగా ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఏపీఓ రత్నమాల

పూసపాటిరేగ: మండల పరిధిలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయని ఏపీఓ రత్నమాల తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 7,800 మంది వేతనదారులు రోజువారీ పనులు చేయాల్సి ఉండగా.. 10,200 మంది వరకు హాజరవుతున్నట్లు చెప్పారు. రోజుకు 200 రూపాయలకు పైబడి వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. ప్రతి రోజూ ఉదయం ఆరు గంటల నుంచి 11 వరకు.. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మండల పరిధిలో 200 ఎకరాల వరకు ఉద్యానవన తోటలను వేతనదారులతో సాగు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఈసీ రాజేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు శాంతి, సుమతి, ప్రమీల, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### అభినందనలు



మాట్లాడుతున్న ఐపీఓ కళింగవర్ధన

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యనభ్యసించి 2024 సంవత్సరంలో ఉద్యోగం సాధించిన 134 మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి, తదితరులు గురువారం అభినందించారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన అభినందన సభలో ఇండస్ట్రీస్ ప్రమోటింగ్ అధికారి బి.కళింగవర్ధన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యతో త్వరితగతిన ఉద్యోగాలు సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనివాసునికి పుష్పయాగం



శ్రీనివాసునికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: తోటపాలెంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి 44వ బ్రహ్మోత్సవ తిరుకల్యాణ, అష్టోత్తర శత కలశ స్నపన మహాకలశాభిషేక మహోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం రంగాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురికి ఆలయ కమిటీ అధ్యక్షుడు సూర్యభగవాన్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రగతి బాటలు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. టీడీపీ హయాంలో పల్లెలకు రహదారులు వేయకపోవడంతో రాకపోకలకు ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కృషితో ప్రతి గ్రామానికీ రహదారి సౌకర్యం కలిగింది.రూ.5.20 కోట్లతో సుమారు 14 కిలోమీటర్ల మేర తారురోడ్లు.. రూ. 2.50 కోట్లతో 9 కిలోమీటర్ల మేర సీసీ రహదారులు వేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రయ్..రయ్ మంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

– విజయనగరం రూరల్



బద్దుకొండపేట- కొత్తూరు రోడ్డు



మలిచర్ల గ్రామంలో రూ. 13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు



నారాయణపురం గ్రామానికి నిర్మించిన నిర్మించిన సీసీ రోడ్డు



బియ్యాలపేట గ్రామానికి ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన రోడ్డు

## శ్రీనివాసుడికి ప్రత్యేక పూజలు



నరసింహుని అవతారంలో శ్రీనివాసుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని ఆలయంలో శ్రీనివాసుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని శ్రీనివాసుడిని నరసింహునిగా అలంకరించి, చందనం పూశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి, నీరజమన్నే, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఐదో తరగతిలో ప్రవేశాలు



రమామోహిని, ప్రిన్సిపాల్

నెల్లిమర్ల : స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో శుక్రవారం నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... పాఠశాలలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రవేశాల కోసం ఇప్పటికే రాత పరీక్ష నిర్వహించామన్నారు. రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న విద్యార్థులు ఈ నెల 24 నుంచి 29వ తేదీ లోగా ప్రవేశాలు ఖరారు చేసుకోవాలని సూచించారు.

## క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలో గుర్తించాలి

- ఆర్‌ఎంఓ సురేష్‌బాబు



మాట్లాడుతున్న ఆర్‌ఎంఓ సురేష్‌బాబు, డాక్టర్ శివకుమార్

విజయనగరం ఫోర్ట్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంఓ ఎస్.సురేష్‌బాబు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో సీహెచ్‌సీ వైద్యులకు నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్‌పై గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని చెప్పారు. సకాలంలో గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయి సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాదరావు, ఈఎన్‌టీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బర్ల అజయ్‌కుమార్, దంత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. కామేశ్వరావు, ఎన్‌సీడి క్లినిక్ వైద్యాధికారి డాక్టర్ జి. మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## జూలై 14 నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేట షిర్డీసాయి ఆలయంలో జూలై 14 నుంచి 21 వరకు ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నటు షిర్డీసాయి ట్రస్ట్ అధినేత బొడ్డు విజయ రామయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 5.15 గంటలకు కాకడ హారతి నుంచి రాత్రి 10.30 గంటలకు నిర్వహించే పవళింపు సేవ వరకు అనేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. అలాగే ప్రతిరోజూ హోమం చేపడతామని తెలిపారు.

## పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు



పూసపాటిరేగ మండలానికి వచ్చిన పాఠ్యపుస్తకాలు

- పాఠశాలలు తెరిచిన మొదటి రోజే విద్యార్థుల చేతికి..

పూసపాటిరేగ: ఎన్నికల సమయం అయినప్పటికీ విద్యార్థులకు ఎటువంటి నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సిద్ధం చేసింది. ఇప్పటికే ముద్రణ పూర్తయి జిల్లాకు వచ్చిన పాఠ్య పుస్తకాలను మండలాలకు తరలిస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండల కేంద్రాలకు పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఒకటి నుంచి పదో తరగతి వరకు అన్ని పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ప్రారంభం రోజునే...**

జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. ఆ సమయానికి విద్యార్థుల చేతికి పాఠ్య పుస్తకాలు అందించనున్నారు. ఐదు సంవత్సరాల నుంచి విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నారు. పంపిణీ చేసిన పుస్తకాల వివరాలును రిజిస్టర్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో సుమారు 60 వేల పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధం చేయగా.. పూసపాటిరేగ మండలంలో 16,200 వరకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నారు.

**పుస్తకాలు వచ్చాయి..**

పూసపాటిరేగ మండలానికి చేరిన 16,200 పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మండల కేంద్రానికి నూతన పాఠ్య పుస్తకాలు వచ్చాయి. పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇచ్చి వారి ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తాం.

– బీపీ నాయుడు, మండల విద్యాశాఖాధికారి, పూసపాటిరేగ

## వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంచాలకురాలు చిన్మయిదేవి సూచించారు. స్థానిక మహిళా ప్రాంగణంలో ప్రపంచ రుతుక్రమ దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రుతుక్రమ సమయంలో పరిశుభ్రతపై యుక్త వయస్సు బాలికల్లో అవగాహన తప్పనిసరన్నారు. బాలికలు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల కూడ శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి. శాంతకుమారి, సీడీపీఓ డోకుల ఉమాభారతి, తదితరులు పాల్గొన్నారు.

### రేపటి నుంచి గురుకులంలో ప్రవేశాలు

లక్కవరపుకోట: జమ్మాదేవిపేటలోని మహాత్మా జ్యోతిబా బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి అడ్మిషన్లు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఎంపికై న విద్యార్థినుల తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లకు ఇప్పటికే సమాచారం అందించామని పేర్కొన్నారు. మెరిట్ జాబితా పాఠశాల ప్రధాన గేటు వద్ద అతికించామని తెలిపారు. అడ్మిషన్‌లకు వచ్చే విద్యార్థినులు తమ ర్యాంక్ కార్డు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెలుపు రేషన్ కార్డు జెరాక్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌తో శనివారం ఉదయం 10 గంటలకు పాఠశాలలో హాజరు కావాలని సూచించారు.

### పాఠశాల స్థాయి నుంచే క్రీడాస్ఫూర్తి



ఇండోర్ గేమ్స్ ఆడుతున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పాఠశాల స్థాయి నుంచే అలవరచుకోవాలని.. అందుకోసం ఆటపాటల్లో పాల్గొనాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఇంట్లో ఆడుకొనే క్రీడలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. చదరంగం, వైకుంఠపాళీ, తదితర ఆటలు ఆడించి, అవగాహన కల్పించారు.అనంతరం వివిధ కళాంశాలపై మెలకువలు వివరించారు.

## • చండీ హోమం



వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంపైడితల్లి అమ్మవారి చదురుగుడి, వనంగుడి ఆవరణలో గురువారం చండీయాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, తాతా రాజేష్, దూసి శివప్రసాద్ శర్మ, సాయి, తదితరులు వేదమంత్రోచ్ఛరణలతో యాగం నిర్వహించారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు పర్యవేక్షించారు.

– విజయనగరం టౌన్

## అన్నమాచార్యునికి స్వర నీరాజనం



అన్నమయ్యకు స్వరనీరాజనం పలుకుతున్న గాయనీ,గాయకులు

- ప్రత్యేక ఆకర్షణగా వేంకటేశ్వరస్వామి 12 అడుగుల విగ్రహం

విజయనగరం టౌన్: శ్రీవారి స్వచ్ఛంద సేవాసంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి వేడుకలను గురువారం సాయంత్రం స్థానిక గురజాడ కళాభారతి వేదికపై ఘనంగా నిర్వహించారు. యనమండ్ర వేణుగోపాలశాస్త్రి ఆశీస్సులతో కార్యక్రమాన్ని కళాపీఠం వ్యవస్థాపకుడు ఎం.భీష్మారావు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీఎస్ గ్రూప్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాస్ హాజరయ్యారు. కళావేదికపై ఏర్పాటు చేసిన వేంటేశ్వరస్వామి 12 అడుగుల విగ్రహం, సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం భీష్మారావు సారథ్యంలో అన్నమయ్య సంకీర్తనలను గాయనీ, గాయకులు హృద్యంగా ఆలపించారు. భగవతీ నృత్య కళామందిర్ రమణ కుమారి బృందం నిర్వహించిన అన్నమయ్య జననం నృత్యరూపకాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గ్రంధి విష్ణుమూర్తి, గౌరవాధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, కోశాధికారి వైవీవీ సత్యనారాయణ (అబ్బులు), సహాయ కార్యదర్శి బి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.ఉమాశంకర్, అక్షయ కన్‌స్ట్రక్షన్ అధినేత ఏగిరెడ్డి తిరుపతినాయుడు, డాక్టర్ జి.సన్యాసమ్మ, ఈఆర్.సోమయాజులు, కాపుగంటి ప్రకాష్ , అధిక సంఖ్యలో సంగీతాభిమానులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆలయ వార్షికోత్సవం



శృంగవరపుకోట: సీతారాంపురం పూజలందుకుంటున్న మరిడిమాంబ అమ్మవారు

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు.



శృంగవరపుకోట: సీతారాంపురంలో మరిడిమాంబను దర్శించుకుంటున్న భక్తులు

**ముగిసిన వేడుకలు**

జామి: కుమరాం గ్రామంలోని కల్యాణ్‌నగర్‌లో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఐశ్వర్యలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆలయ వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్వామివారికి అష్టోత్తర శత నామావళి, ఆరాధన,పుష్పయాగం, ఉంజల్‌సేవ, శ్రీహరి సంకీర్త న, పండిత సత్కారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేసి, వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూ జలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

**ధారగంగమ్మ పండగ**



జామి: కుమరాంలో ఐశ్వర్యలక్ష్మీ నరసింహస్వామికి అభిషేకం

శృంగవరపుకోట: ఎస్.కోటలో గ్రామదేవత ధారగంగమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయాలను అనుసరించి, పండగ చేస్తున్నారు. సీతంపేట గ్రామంలో గురువారం అమ్మవారి జంగిడిని ఊరేగించారు. అమ్మవారి సేవకులు వచ్చే రోడ్డులో గ్రామస్తులు నీళ్లు పోసి, వారి కాళ్లు కడిగి ఆహ్వానించారు.